
వేదికపై బతుకమ్మలతో గాయని మంగ్లీ, హీరోయిన్ కావ్య థాపర్‌తో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


బతుకమ్మ సంబరాల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య




ప్రముఖ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# పూలనూ పూజించే సంస్కృతి మనది

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి • అంబర్‌పేటలో అంబరాన్నంటిన సంబురాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ వేడుకలు ప్రతిబింబిస్తాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పూలనూ పూజించే సంస్కృతి మనదని... ఆ ప్రత్యేకత బతుకమ్మ పండుగకు ఉందన్నారు. బుధవారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటేలా జరిగాయి. ఈ వేడుకలకు ప్రముఖ సినీ గాయకులు వందేమాతరం శ్రీనివాస్, మంగ్లీలు వచ్చి సందడి చేశారు. తమదైన పాటలతో పాడి ఉర్రూతలూగించారు. హీరోయిన్ కావ్య థాపర్ హాజరై సందడి చేశారు. బతుకమ్మ ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..... మహిళల చైతన్యానికి బతుకమ్మ వేడుకలు ఎంతో దోహదపడుతాయన్నారు. సమాజంలో మంచి చెడులను పాటల రూపంలో మహిళాలోకం గలమెత్తేందుకు బతుకమ్మ వేడుకలు వేదిక అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు, మాజీ మంత్రి కృష్ణ యాదవ్, కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – అంబర్‌పేట




భోలక్‌పూర్ ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన ఉత్సవాల్లో వైద్య బృందం


ముషీరాబాద్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి


కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో బతుకమ్మ వేడుకలు


వివేక్‌నగర్‌లో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ రాష్ట్ర కార్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో అధికారులు నీలమ్మ, సునీత, లక్ష్మి


ఇందిరాపార్కులో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ తదితరులు


గాంధీనగర్ డివిజన్‌లో బదుకమ్మ ఆడుతున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్లు పావని, రచనశ్రీ


ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్‌ను మెమెంటోలతో సన్మానిస్తున్న కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ దంపతులు

## పేదల అభ్యున్నతికి కృషి

అంబర్‌పేట: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి అమ్మాయి వివాహానికి అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. బుధవారం అంబర్‌పేట మండల పరిధిలో లబ్ధిదారులకు మంజూరైన రూ.1.02కోట్ల విలువ చేసే చెక్కులను కార్పొరేటర్లు విజయ్ కుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి, అమృతతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదల కోసం అమలవుతున్న సంక్షేమ పథకాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యన్ని నివారించాలన్నారు. పేదల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**అంతకు ముందు కాంగ్రెస్ నేతల పంపిణీ...**

లబ్ధిదారులకు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, పులి జగన్, కోటం అనిల్, రామ్మోహన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్లు

## ఆకట్టుకున్న వీణవాద్య కచేరి

నల్లకుంట: మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీసరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం న్యూ నల్లకుంటలోని న్యూ రామాలయంలో భక్తి సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వీణా విద్వాంసుడు, పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మ ప్రదర్శించిన వీణవాద్య కచేరి ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే శ్రీసరస్వతి సంగీత విద్యాలయం ఉపాధ్యాయురాలు యశస్విని ఆధ్వర్యంలో రాగిణి, శ్రావణి, శ్రీవిద్య, చేతన్ శర్మ, దివీష బృందం చే నిర్వహించిన భక్తి సంగీత కచేరి విశేషంగా అలరించింది. దీనికి మృదంగంపై రవికుమార్ వాద్య సహకారమందించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు, కమిటీ సభ్యులు శ్రీనివాస శర్మ, యశస్విని బృందాన్ని సన్మానించి ప్రసాదం అందజేశారు.

## బతుకమ్మకుంట ప్రైవేటు వ్యక్తుల స్థలం

- అంబర్‌పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి
- బతుకమ్మకుంటపై వీహెచ్‌కు కనీస అవగాహన లేదు

అంబర్‌పేట: ప్రైవేటు వ్యక్తుల స్థలాన్ని ప్రభుత్వ భూమిగా అసత్య ప్రచారం, ఆరోపణలు చేయడాన్ని మానుకోవాలని.. లేదంటే న్యాయపరంగా పరువు నష్టం దావా వేస్తానని అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతారావును హెచ్చరించారు. ఒక ప్రాంతానికి సంప్రదాయ పేరు ఉంటే అది ప్రభుత్వ స్థలం అవుతుందా..? అని ప్రశ్నించారు. అంబర్‌పేట బతుకమ్మకుంట ప్రాంతంలో ఉన్న స్థలంలో ప్రభుత్వం నీటికుంటను ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకోవాలని వీహెచ్ పలు వేదికలపై మాట్లాడటం తగదన్నారు.

◆ బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మకుంట స్థలం ప్రైవేటుదన్నారు. ప్రస్తుతం ఈ వివాదం కోర్టులో ఉందన్నారు. కనీస అవగాహన లేకుండా వీహెచ్ మాట్లాడుతున్నారని అన్నారు. బతుకమ్మకుంటను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేయాలని చెప్పడం అర్థరహితమని అన్నారు. 1966లో ఇక్కడి స్థలం మ్యూటేషన్ అయిందన్నారు. పలు ప్రభుత్వ విభాగాలు సైతం ఇక్కడ నీటి కుంట లేదని చెప్పాయని తెలిపారు.

**వీహెచ్ పార్కు స్థలం కబ్జా చేసి..**

వీ.హనుమంతారావు మూడు దఫాలుగా ఎంపీగా ఉండి అంబర్‌పేట నియోజకవర్గంలో ఎన్ని నిధులు తీసుకొచ్చారో చెప్పాలన్నారు. వీహెచ్ ఇంటి ముందు భాగ్యనగర్ సొసైటీకి చెందిన పార్కు స్థలాన్ని కబ్జాచేసి భవనాన్ని నిర్మించి కార్పొరేటర్ కళాశాలకు అద్దెకు ఇచ్చారని ఆరోపించారు. అంబర్‌పేటలో ఒక పెద్ద మనిషిగా వీహెచ్‌ను గౌరవిస్తుంటే అతను స్థాయికి తగ్గట్టు వ్యవహరించడం లేదని అన్నారు. ఇకపై బతుకమ్మకుంటపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

కాచిగూడ: బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గుజ్జ కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల ఫీజుల బకాయిలు మొత్తం రూ.4500 కోట్లలో కేవలం రూ.1500 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. మిగతా రూ.3వేల కోట్ల ఫీజు బకాయిలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులు ఇబ్బందులు పడతారని అన్నారు.

## ఆధ్యాత్మిక ప్రసంగాలపై కవి సమ్మేళనం

చిక్కడపల్లి: గీతా ఫౌండేషన్ కుసుమ ధర్మన్న కళాపీఠం, నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరిస్వామి యాదవ్ ఎడ్యుకేషనల్, స్పోర్ట్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఐఏఎంఎస్, నీట్ అకాడమీ సౌజన్యంతో ఆధ్యాత్మిక ప్రసంగాలపై కవి సమ్మేళనం జరిగింది. కవులు, కవయిత్రులు పాల్గొని స్వీయ కవితలను చదివారు. విశ్వసాహితీ సంస్థ అధ్యక్షుడు బి.జయరాములు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం కవులు, కవయిత్రులకు ప్రశంస పత్రాలను ప్రదానం చేసి సన్మానించారు.

## 9 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కాచిగూడ: అక్రమంగా తరలిస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాక డివిజన్ ఖజాగరీబ్ నగర్ ప్రాంతానికి చెందిన మోహినొద్దీన్ కుమారుడు ఎండీ ఆసిఫ్ (33) రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


## బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ గృహ నిర్బంధం

చిక్కడపల్లి: బీఆర్ఎస్ యువ నాయకుడు, ఎమ్మెల్యే ముఠాగోపాల్ తనయుడు ముఠా జైసింహను పోలీసులు బుధవారం సాయంత్రం గాంధీనగర్‌లో గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సరైన కారణం చూపకుండా పోలీసులు గృహ నిర్బంధం చేయడం సరికాదన్నారు. ఎల్బీస్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి, డీఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేసే కార్యక్రమం, ఎస్సీ రిజర్వేషన్ల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నిర్వహించిన నిరసన ర్యాలీ నేపథ్యంలో ఆరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసుల పాలనలో కొనసాగుతోందని ఆయన విమర్శించారు. అమ్మవారి మండపాల సందర్శనను సైతం అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కారణం లేకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు?

## అహంకారం వీడండి.. ఆధ్యాత్మిక వైపు మళ్లండి.!

**బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు**

చిక్కడపల్లి: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి బ్రహ్మకుమారీస్ చిక్కడపల్లి శాఖ ఆధ్వర్యంలో కలాసుబ్బారావు కళావేదికలో విజయ దశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవరాత్రి, విజయదశమిలోని ఆధ్యాత్మిక రహస్యాన్ని, దేవతల విశిష్టతను సిస్టర్ సుమలత వివరించారు. కామ, క్రోధం, లోభం, అహంకారాలను వీడి ఆధ్యాత్మిక భక్తి భావాన్ని అలవరచుకోవాలన్నారు. చిక్కడపల్లి శాఖ ఇన్‌చార్జి జయశ్రీ స్వాగత ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా వివిధ దేవతామూర్తుల వేషధారణలో పలువురు బ్రహ్మాచారిణులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఏసీపీ రమేష్, సీఐ సీతయ్య, ప్రముఖులు జయశ్రీ, రష్మిత, వంశీ రామరాజు, సర్వోత్తమ్, సిస్టర్ శోభ, సిస్టర్ శ్రీలత, శశికాంత్, గణేష్, దైవజ్ఞశర్మ, తదితరులు పాల్గొన్నారు.


సరస్వతిదేవిగా శంకరమఠం శారదాంబ


జ్ఞానసరస్వతిగా అమ్మవారు


సరస్వతిదేవిగా జైస్వాల్‌గార్డెన్ అమ్మవారు


సరస్వతిదేవిగా వివేక్‌నగర్ భువనేశ్వరిదేవి


లలిత సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

# సరస్వతి నమస్తుభ్యం.!

అంబర్‌పేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంబర్‌పేట నియోజకవర్గం వ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం అంబర్‌పేట మహంకాళి ఆలయంలో అమ్మవారిని సరస్వతి దేవీ రూపంలో అలంకరించారు. హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే జైస్వాల్ గార్డెన్‌లో మైసమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు సరస్వతిదేవి అలంకరణలో దర్శనిమిచ్చారు.

**నల్లకుంట శంకరమఠంలో..**

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో శ్రీ శారదా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం నగరం నలుమూలల నుంచి భక్తులు అశేషంగా తరలి వస్తున్నారు. మహోత్సవాల్లో ఏడో రోజైన బుధవారం మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని శారదాంబ అమ్మవారు 'సరస్వతి'అలంకణలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు శక్తి గణపతికి ఆది పూజలు, చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మూల నక్షత్రం సరస్వతి మాత జన్మదినం కావడంతో అమ్మవారి సన్నిధిలో పలువురు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అలాగే ఋత్వికులు శతచండీ పారాయణ చేశారు.

**నేడు గజలక్ష్మి అలంకరణ..**

మహోత్సవాల్లో భాగంగా గురువారం శారదాంబ అమ్మవారు గజలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని మఠం హెడ్ కె.కృష్ణారావు తెలిపారు. సాయంత్రం లక్ష్మీ ప్రసన్న నాట్యకల్ప స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ స్కూల్ విద్యార్థుల 'నవదేవి వైభవం'నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.

◆ మధ్యాహ్నం దాదాపు రెండు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అద్వైత సిద్ధి రత్నకర్త శాస్త్రనిధి బ్రహ్మశ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యం 'దేవీ భాగవతం'పై ప్రవచనం చేశారు. అనంతరం వైణిక చక్రవర్తి డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీణవాద్య కచేరి అలరించింది.

**న్యూరామాలయంలో 'జ్ఞాన సరస్వతి'గా..**

న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయం(న్యూరామాలయం)లో అమ్మవారు 'జ్ఞాన సరస్వతి'అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అక్కడి యాగశాలలో చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. గురువారం సరస్వతి మాత దుర్గాదేవి అలంకరణలో దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వహణ అధికారి కె. జయంతి తెలిపారు.


రాంనగర్‌లో... బీఆర్ఎస్ నేత నాగేష్‌ముదిరాజ్


బాపిస్ట్ చర్చి గల్లీలో.. నేత శ్రీనివాస్, చరణ్‌సింగ్


మహంకాళి ఆలయంలో హోమం చేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి దంపతులు


గోల్నాకలో కార్పొరేటర్ లావణ్య


ఆంజనేయస్వామి ఆలయంలో చండీహోమం


గాంధీనగర్‌లో పూజలో కాంగ్రెస్ నాయకులు